క్లుప్తంగా

నేడు ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని బుధవారం హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ ప్రారంభించనున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభించనున్న కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొననున్నారు.

క్రీడలకు ప్రోత్సాహం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆన్‌లైన్ క్రీడా వేదిక కిలాడిక్స్ డాట్‌కామ్ తొలిసారిగా ఓ క్రికెట్ లీగ్ పోటీల్లో భాగం కానుంది. ఈ విషయాన్ని నగరంలో ఓ సమావేశంలో సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా యూఏఈలో జరగనున్న టీ–20 క్రికెట్ లీగ్‌లో తాము అబుదాబి నైట్ రైడర్స్‌కు ప్రధాన స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్నామన్నారు. క్రీడలకు తమదైన రీతిలో ప్రోత్సాహం అందించాలనేదే తమ ఉద్దేశ్యమని వివరించారు.

రాజిరెడ్డి సేవలు అభినందనీయం



కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎఫ్‌సీ ఉద్యోగ సంఘం, కార్మికనేతగా సేవలందించిన కాసం రాజిరెడ్డి సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. మంగళవారం ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమానికి హాజరై రాజిరెడ్డిని ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు కటార్ల భాస్కర్, నేమూరి మహేష్‌గౌడ్, గుమ్మడి జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు పనుల్లో వేగం పెంచాలి

మల్లాపూర్: పటేల్‌కుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనుల్లో వేగం పెంచాలని జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు అన్నారు. పటేల్‌కుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొలగింపు పనుల్లో అలసత్వం వహించకుండా పనులు చేపట్టాలన్నారు. సీనియర్ ఎంటామలజిస్ట్ గంగప్ప, ఏఈ రమేష్, సూపర్‌వైజర్ నర్సింహ తదితరులు ఉన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్ జన్మదిన వేడుకలు



వెంకటాపురం మహాబోధి విద్యాలయంలో గద్దర్ జన్మదిన వేడుకలు

అల్వాల్: ప్రజా గాయకుడు గద్దర్ జన్మదిన వేడుకలను వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయంలో మంగళవారం మొదటిసారి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో మహాబోధి విద్యాలయంలో మూడు అంతస్తుల భవనం నిర్మించి నిరుపేద విద్యార్థులకు స్థావరం ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. డాక్టర్ పట్టాబి, పరమేష్ యాదవ్, శంకర్, దేవరాజు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రూ.10 చెల్లిస్తే.. రూ.76 వేలు మాయం

- కరెంటు బిల్లు చెల్లించలేదంటూ బురిడీ
- అప్లికేషన్ డౌన్‌లోడ్‌తో.. ఖాతా ఖాళీ
- నేరేడ్‌మెట్‌లో సైబర్ క్రైమ్ కేసు నమోదు

అల్వాల్: కరెంట్ బిల్లు చెల్లించలేదని ఫోన్‌కు మెసేజ్ పంపి రూ.76 వేలను బ్యాంక్ అకౌంట్ నుంచి కాజేసిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోకుల్‌నగర్ నివాసి చావలి దీప(50)కు కరెంట్ బిల్లు చెల్లించలేదని, కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామని సోమవారం మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె మెసేజ్ వచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి కరెంట్ బిల్లు చెల్లించానని తెలిపింది. దీంతో సదరు వ్యక్తి బిల్లు అప్‌డేట్ కాలేదని, మీరు ప్లేస్టోర్ నుంచి ఒక అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లించాలని సూచించారు. వారి సూచనల మేరకు ఆమె అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లించింది. అనంతరం ఆమె ఖాతా నుంచి రూ.76,400లు మాయం అయ్యాయి. తాను మోసపోయానని భావించి నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతులకు రూ.100 కోట్లు

- అభివృద్ధి పథంలో బోడుప్పల్ కార్పొరేషన్
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి
- మూడేళ్లు పూర్తి చేసుకున్న పాలకవర్గం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మూడేళ్లగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. అధికారులు, పాలకవర్గం కలిసి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇతర పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా అధికారులు, పాలకవర్గం సమన్వయంతో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పాలకవర్గం ఏర్పడిన మూడేళ్లలో రూ.100 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు.

2019లో కార్పొరేషన్‌గా రూపాంతరం..

బోడుప్పల్ నగర పాలక సంస్థ 2019 సంవత్సరం జూలై 23వ తేదీన ఆవిర్భవించింది. 2020 జనవరి 27వ తేదీన తొలి పాలకవర్గం ఏర్పడగా సామల బుచ్చిరెడ్డి మేయర్‌గా ఎన్నికయ్యారు. నగర పాలక సంస్థ 20.53 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 40 వేలు ఇళ్లు ఉండగా, జనాభా 1.60 లక్షలు ఉన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అధిక ప్రాధాన్యం

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో అధికారులు, పాలకవర్గం అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మూడేళ్లలో రూ.34 కోట్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కేటాయించారు. అలాగే రా చెరువు నుంచి ఉప్పల్ నల్లచెరువు వరకు నాలా నిర్మాణం కోసం రూ.12.75 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేశారు. మిగిలిన నాలా పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

దశలవారీగా రోడ్ల అభివృద్ధి

అధికారులు, పాలకవర్గం తొలుత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్లు, బీటీరోడ్లు వేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.8.56 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం రూ.7 కోట్లు కేటాయించగా ప్రస్తుతం పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

ఇతర పనుల కోసం కేటాయించిన నిధులు

- ప్రహరీల నిర్మాణానికి రూ.6.84 కోట్లు
- స్వచ్ఛ సర్వేక్షణ్ ఆటోల కొనుగోలుకు రూ.2.93 కోట్లు
- ట్రీ పార్కుల అభివృద్ధికి రూ.2 కోట్లు
- సీసీ కెమెరాల కొనుగోలు, నిర్వహణకు రూ.1.50 కోట్లు
- హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు రూ.96 లక్షలు



బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం

- పబ్లిక్ టాయిలెట్స్ కోసం రూ.79 లక్షలు
- నర్సరీలకు రూ.76 లక్షలు
- బోర్ వెల్స్‌కు రూ.70 లక్షలు
- శ్మశానవాటికలు, పచ్చదనానికి రూ.59 లక్షలు
- కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.38 లక్షలు
- బస్తీ దవాఖానాలకు రూ.11 లక్షలు

మౌలిక వసతుల కల్పనకే అధిక ప్రాధాన్యం



మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయించి మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థల్లో రూ.110 కోట్లతో త్వరలో వరద నీటి డ్రైనేజీ పనులు చేపట్టనున్నాం. రానున్న రెండేళ్లలో మిగిలిపోయిన నాలా పనులు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి, పూర్తి చేసేందుకు అధికారులు, పాలకవర్గం కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– సామల బుచ్చిరెడ్డి, మేయర్, బోడుప్పల్ నగర పాలక సంస్థ

దళితబంధును సద్వినియోగం చేసుకోండి



దళితబంధు లబ్ధిదారులతో ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: దళితబంధు పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. ఆయన నివాసంలో నియోజకవర్గంలో మొదటి విడత లబ్దిదారులు వందమందితో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకంలో భాగంగా కుటుంబంలో ఒకరికి పెద్ద మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం రుణాన్ని మంజూరు చేస్తోందన్నారు. దేశంలోనే ఇటువంటి పథకం లేదన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న పరిశ్రమలు, దుకాణాల ద్వారా జరుగుతున్న వ్యాపారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈడీ బాలాజీ, నాయకులు గుండా నిరంజన్, రాముయాదవ్, ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు



లారీల యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ: ఈసీఐఎల్–కీసర రోడ్డు మార్గంలో ఇష్టారాజ్యంగా ఇసుక లారీలను పార్కింగ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ స్థానికులు రాచకొండ సీపీకి ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో మంగళవారం కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు లారీల యజమానులు, డ్రైవర్లలతో సమావేశమయ్యారు. అడవిలా ఉండే చర్లపల్లి ప్రాంతం అభివృద్ధి చెందింది. రోడ్లు విస్తరించాయి, పెద్ద పెద్ద భవనాల నిర్మాణాలు పెరుగుతున్నాయి.. ట్రాఫిక్ పెరిగిపోయిన క్రమంలో మార్పు జరగాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వారికి అవగాహన కల్పించారు. రోడ్ల వెంట ఇసుక లారీలను పార్కింగ్ చేసి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. ఇకపై రోడ్ల వెంట అక్రమ పార్కింగ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని చర్చ్ హైస్కూల్‌లో 1993 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో తమ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి సేవా సంస్థను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. శ్రీనివాస్‌రెడ్డి, ధనుంజయ్‌గౌడ్, శ్రీనివాస్, జంగయ్య, అనిల్, సుధాకర్, ఉదయలక్ష్మి, రోజారాణి, మంజుల, ఉమారాణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.



రూ.98 లక్షలతో అభివృద్ధి పనులు



కురుమానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ కురుమానగర్‌లో రూ.98 లక్షలతో అభివృద్ధి పనులను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందముల రజితా పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం శాంతినగర్‌లో రూ.38 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు, మాజీ కార్పొరేటర్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, సర్కిల్ ఈఈ నాగేందర్, ఏఈ వసంత, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, బద్దం భాస్కర్‌రెడ్డి, గరిక సుధాకర్, మేకల మధుసూదన్‌రెడ్డి, చింతల నర్సింహారెడ్డి, మస్క సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో అభివృద్ధి పనులపై ఆరా



మేడిపల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మేడిపల్లి: మనబస్తీ– మనబడి కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులు, పర్వతాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు నిర్మించిన అదనపు తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్, కిచెన్, ప్రహరీ నిర్మాణాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ పి.రామకృష్ణరావు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ వినీల్‌గౌడ్ తదితరులు అభివృద్ధి పనులను పరిశీలించారు.

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఉప్పల్: తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రెడ్డి సంఘం కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు కాంసాని సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, కందుల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పబ్బతి శేఖర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గుడి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చేయూత



మల్కాజిగిరి: దివ్యాంగురాలైన హేమలతకు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చేయూత అందించారు. కుటుంబపోషణకు ఆమె చాలాదూరం కట్టె సహాయంతో నడిచి వెళ్తుండటంతో సమితి జిల్లా అధ్యక్షుడు వినయ్ ఆమెకు ట్రైసైకిల్‌ను అందజేశారు.

బఫర్ జోన్‌ను కాపాడండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: ఉప్పల్, నాచారం పెద్ద చెరువు మధ్యలోని బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలతో పాటు స్థలాల కబ్జాలు జోరుగా కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే అరికట్టాలని మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఉప్పల్ సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వారం రోజుల్లో బఫర్ జోన్‌లోని కబ్జాలు, అక్రమ నిర్మాణాలను అరికట్టకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గణేష్‌నాయక్, రమేష్‌నాయక్, సంతోష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్య చేసుకుంటున్నా..' వీడియో కాల్..



వెంకటేష్(ఫైల్)

మల్కాజిగిరి: ఆత్మహత్య చేసుకుంటానని వీడియో పంపి ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. విష్ణుపురికాలనీకి చెందిన ఐతరాజు వెంకటేష్(26) కారు డ్రైవర్. 8 నెలల క్రితం రమ్యను ప్రేమ వివాహం చేసుకొని అదే ప్రాంతంలో కుటుంబసభ్యులకు దూరంగా ఉంటున్నాడు. తరచూ భార్యాభర్తలు గొడవపడేవారు. సోమవారం తన సోదరి, బావను విందుకు ఆహ్వానించాడు. ఆ సమయంలోనూ భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించడంతో బావ అడ్డుకున్నాడు. మరోమారు నిద్రమాత్రలు మింగేందుకు ప్రయత్నించాడు. పలువురు అడ్డుకోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం అతడి సోదరుడికి వీడియో కాల్ చేసి చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు కేటాయించాలని వినతి



ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్

ఉప్పల్: డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లో ఓల్డ్ విలేజ్ ఉన్నందున అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని శాశ్వతంగా పరిష్కరించేందుకు తగినన్ని నిధులు ఇవ్వాలని కోరారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మోడ్రన్ శ్మశానవాటికగా తీర్చిదిద్దాలి



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న తండావాసులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని సింగం చెరువు తండాలోని శ్మశానవాటికను మోడ్రన్ వైకుంఠధామంగా తీర్చిదిద్దాలని కోరుతూ తండావాసులు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బంజారా యూత్ స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీరునాయక్, సింగం చెరువు తండావాసులు తదితరులు ఉన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్ సమస్యలపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో సాయినగర్ కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఆదర్శనగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీ ప్రజలకు రోడ్డు సమస్య ఉందని, దమ్మాయిగూడ, సాకేత్ మెయిన్‌రోడ్డు, చక్రిపురం హైటెన్షన్ రోడ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని, అలాగే జ్యోతినగర్, విద్యామారుతీనగర్, బీఎన్‌రెడ్డినగర్, ఆఫీసర్స్ కాలనీ, నేతాజీనగర్, ఇందిరాగృహకల్పకాలనీతో పాటు కుషాయిగూడలో పలు కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



వెస్ట్ కాకతీయనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ వెస్ట్ కాకతీయనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అధికారులతో కలిసి మంగళవారం కాలనీలో పర్యటించారు. కాలనీలో రోడ్డు, నాలా, పలు సమస్యలను తెలిపారు. త్వరలోనే నాలాను డీసెల్టింగ్ చేయించి రోడ్డు పనులను చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. బీజేపీ నాయకులు సర్వేష్ యాదవ్, సోమనాథ్‌చారి, వెంకటేష్, నరేందర్, కాలనీ వాసులు సంజయ్, శ్రీకాంత్, రజిని పాల్గొన్నారు.

ఫీడర్ లైన్ ఏర్పాటు చేయాలి



రాఘవేంద్రనగర్ కాలనీలో కార్పొరేటర్, జలమండలి అధికారుల పర్యటన

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి పర్యటించారు. రాఘవేంద్రనగర్ కాలనీలో లోప్రెషర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని జలమండలి అధికారులతో స్థానికులు మొర పెట్టుకున్నారు. లోప్రెషర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, రాఘవేంద్రనగర్ కాలనీలో ఫీడర్‌లైన్ ఏర్పాటు చేయాలని జలమండలి డీజీఎం సతీష్‌ను కార్పొరేటర్ కోరారు. త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ సందీప్, బీఆర్ఎస్ నేతలు విఠల్ యాదవ్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

వైద్యులు లేకుండా కంటి వెలుగు ఎలా..?



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: గాయత్రినగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ కాలనీవాసులతో కలిసి సందర్శించారు. కళ్లను పరీక్షించే వైద్యులు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, వైద్యులు లేక అరకొర అధికారులతో విధులు నిర్వర్తిస్తుండటంపై నిలదీశారు. ఆమె మాట్లాడుతూ.. నాణ్యతలేని అద్దాలతో ప్రజలను అనారోగ్యాలకు గురిచేస్తున్నారన్నారు. వైద్యులు లేకుండా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం ఏమిటన్నారు. మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, కాలనీ అధ్యక్షులు డాక్టర్ లోహిత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాయకులు శివకుమార్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, నటరాజు, సాయికుమార్, కిరణ్‌శ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.